నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ కిషన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని హుడా కాలనీ, జిర్రా రోడ్, గంజిషా దర్గా తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అలాగే 11 కే.వీ దత్తాత్రేయనగర్ ఓవర్ హెడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జ్యోతి గ్యాస్ లేన్, పాపాలాల్ పీటీ, వెంకటమ్మ తోట, మల్లేపల్లి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అభినందనలు



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ షబ్బీర్ అలీని టీపీసీసీ మాజీ కార్యదర్శి, గౌలిపురా కోట మైసమ్మ ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్‌రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

జోరుగా అక్రమ నిర్మాణాల దందా

- పాతబస్తీలో ఎలాంటి అనుమతులు లేకుండానే సెల్లార్లు, ఐదారు అంతస్తులు
- రాజకీయ నాయకుల అండదండలతో బ్రోకర్ల దందా
- బేఖాతరవుతున్న నిబంధనలు
- ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు

చార్మినార్: జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల దందా జోరుగా కొనసాగుతోంది. సంబంధిత జీహెచ్ఎంసీ సర్కిల్, టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే నిర్మాణాలు జరుగుతున్నా అడ్డు చెప్పే అధికారులెవరు లేరు. ఆయా సర్కిల్స్‌లోని డివిజన్‌లలో అనుమతులు లేకుండానే అక్రమ పద్ధతిలో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నీకు ఇంత..సార్‌కు ఇంత..అంటూ అనధికారికంగా లెక్కలు వేసుకుని అధికారికంగా అనుమతులను తీసుకోవడం లేదు. నేను చూసుకుంటా అంటూ స్థానిక రాజకీయ పార్టీల నాయకులు హామీ ఇస్తుండడంతో ఇక జీహెచ్ఎంసీ సర్కిల్స్‌లోని అధికారుల నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులను మచ్చిక చేసుకుంటున్న బ్రోకర్లు కింది స్థాయి సిబ్బంది ద్వారా కథ నడుపుతున్నారు.

అనుమతులు లేకుండానే...

అధికారికంగా ఎలాంటి అనుమతులు లేకుండానే చార్మినార్ జోనల్ కమిషనర్ పరిధిలో యథేచ్ఛగా అనుమతులు లేకుండానే సెల్లార్‌లు, ఐదారు అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అడ్డు చెప్పే వారు కరువయ్యారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే.. ఇక సంబంధిత అధికారులకు కాసుల వర్షం కురుస్తుంది. వచ్చిన ఫిర్యాదును ఆసరా చేసుకుని నిర్మాణదారుల వద్ద నుంచి మరింత ఎక్కువ మొత్తంలో డబ్బులు లాగే ప్రయత్నాలు చేస్తారు. ఇలా జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని సర్కిల్–6, 7, 8, 9, 10, 11లలో అక్రమ నిర్మాణాల దందా కాసుల వర్షం కురిపిస్తోంది.

నాయకుల అండదండలతో..

- పాతబస్తీలో గృహ, వ్యాపార నిర్మాణాల నిబంధనలు బేఖాతరవుతున్నాయి.
- సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకపోవడమే కాకుండా ఇష్టానుసారంగా భవన నిర్మాణాలను చేపడుతున్న యజమానులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.
- రాజకీయ ఒత్తిడులకు తలొగ్గుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలున్నాయి.
- సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో భవన నిర్మాణం పనులను అంతగా పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా తమ పని కానిస్తున్నారు.
- నిబంధనలను అతిక్రమిస్తున్న యజమానులపై జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్‌కు చెందిన డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. చాలా చోట్ల నిబంధనలను బేఖాతరు చేస్తు యజమానులు తమ ఇష్టానుసారంగా నిర్మాణాలను చేపడుతున్నారు.



నర్కిపూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం

క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి..



నిబంధనలు బేఖాతరు అవుతున్నప్పటికీ.. కొంత మంది అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదేమని ప్రశ్నించే వారు కరువయ్యారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. కేవలం నోటీసులు జారీ చేయడం వరకే పరిమితం కావద్దు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలి. – కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్, పాతబస్తీ

తగిన చర్యలు తీసుకుంటున్నాం..



అక్రమ కట్టడాల పట్ల తాము ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం. తగిన ఆధారాలతో రాతపూర్వకంగా మాకు ఫిర్యాదులు అందితే వెంటనే కార్యాచరణ చేపడుతున్నాం. నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదు. మా అధికారులు, సిబ్బందిని సైతం అప్రమత్తం చేశాం. – వెంకన్న, జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



సిటీ కాలేజీ చౌరస్తాలో ఏబీవీపీ నేతల మానవ హారం

చార్మినార్: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కోఠి జిల్లా, చార్మినార్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సిటీ కాలేజీ చౌరస్తాలో విద్యార్థులు మానవ హారం నిర్వహించారు. స్కాలర్‌షిప్ విద్యార్థులకు వేసే భిక్ష కాదని.. అది విద్యార్థుల హక్కు అని విద్యార్థులు ఏబీవీపీ జెండాలు పట్టుకుని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ కల్యాణ్ మాట్లాడుతూ.. రూ.5312 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సజన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్ డీఆర్ఓకు ఫిర్యాదు అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

గోల్కొండ: యాదవ భవనం అక్రమంగా కూల్చివేసిన ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతిని వెంటనే సస్పెండ్ చేసి కూల్చివేతపై సమగ్ర విచారణ చేపట్టాలని యాదవ సంఘం ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా డీఆర్ఓను కోరారు. బుధవారం కార్వాన్ యాదవ సంఘం ప్రతినిధులు జిల్లా డీఆర్ఓను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ జ్యోతి యాదవ సంఘం ప్రతినిధులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యాదవ సంఘం భవనాన్ని అక్రమంగా కూల్చివేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఆర్ఓను కలిసిన వారిలో యాదవ సంఘం అధ్యక్షులు బోడి అశోక్‌కుమార్‌యాదవ్, అఖిల భారత యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు రాములు, కార్పొరేటర్ స్వామియాదవ్, వంశీమోహన్‌యాదవ్, బోడి ప్రేమ్‌కుమార్ యాదవ్, సంగయ్యయాదవ్ తదితరులున్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకి డివిజన్లలో పర్యటించారు. అనంతరం ఆయా ప్రాంతాల మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యులు ప్రతిరోజు తమ ప్రాంతపు ప్రజలకు అందుబాటులో ఉండాలని దీన్ని వల్ల స్థానిక సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. మజ్లిస్ ఏరియా కమిటీ సభ్యులు అధికారులు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను అధికారులకు తెలుపుతు ఉండాలన్నారు. కార్వాన్ నియోజకవర్గాన్ని గత పదేళ్లలో తాను వందలాది రూపాయలతో అభివృద్ధి చేశానని అన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి చొరవతో నియోజకవర్గానికి సుమారు 300 కోట్ల రూపాయల డ్రైనేజీ పనులకు మంజూరు లభించిందని అన్నారు. ఈ సంవత్సరం కూడా కార్వాన్ అభివృద్ధికి వివిధ రకాల పనులకు గాను నిధులు కేటాయించాలని కోరుతూ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి వివరించామన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫారన్, ఆలీముద్దీన్, జబ్బార్ తదితరులున్నారు.

డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలన..

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆదేశాల మేరకు గోల్కొండ సాలేనగర్, కంచె తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ పూడికతీత పనులు చేయిస్తున్నామని మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షులు సిద్ధిఖ్ అన్నారు. బుధవారం సాలెనగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పూడితతీత పనులను ఆయన పరిశీలించారు.

మేరు కులస్తులకు రాజ్యసభ స్థానం కేటాయించాలి



మంత్రిని సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు రాజ్యసభ స్థానం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ మేరు పేర్కొన్నారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో తనకు రాజ్యసభ సభ్యుడిగా కేటాయించేందుకు కృషి చేయాలని పోల్కం శ్రీనివాస్ మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. శాలువాతో ఆమెను ఘనంగా సత్కరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..అసెంబ్లీ రాబోయే రాజ్యసభ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ కులస్తులకు ప్రాధాన్యమివ్వాలని, ఎంతో వెనుకబడి మేరు కులస్తులకు అండగా ఉండాలన్నారు. త్వరలోనే ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీని కలిసి విజ్ఞప్తి చేస్తామని పోల్కం శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందించారు. మేరు కులస్తులకు అండగా ఉండేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్, గంగాపురం దశరథ్, గోపాల్ రెడ్డి పోల్కం, వినయ్‌రాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ యూనియన్



సీఆర్ఓ ఫణీంద్రర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగులకు అండగా ఉండి పలు శాఖల ఉద్యోగుల సమస్యలను వేగవంతంగా పరిష్కరిస్తామని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా నియమితులైన ఫణీంద్ర రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..రేషనింగ్ శాఖతో పాటు హైదరాబాద్ జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగుల సమస్యలను ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేగవంతంగా పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉందన్నారు. ప్రతిరోజు అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పర్యటించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్. విక్రమ్ కుమార్, కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు బయలుదేరిన బీజేపీ నేతలు



సబ్జిమండి నుంచి వెళ్తున్న కర సేవకులు కట్ట నర్సింగ్ రావు తదితరులు



ట్రైన్‌ను ప్రారంభిస్తున్న గోపాల్‌జీ, ప్రేమేందర్ రెడ్డిలు

అబిడ్స్: అయోధ్య యాత్రకు ఆస్తా ట్రైన్‌ను రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ, ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి ప్రారంభించారు. బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్య యాత్ర కోసం హైదరాబాద్ పార్లమెంట్ నుంచి బీజేపీ ఉచితంగా కార్యకర్తలు, నాయకులను పంపించింది. జెండా ఊపి గోపాల్‌జీ, ప్రేమేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 1400 మంది బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్యకు తరలివెళ్లారు.

కార్వాన్ సబ్జిమండి నుంచి..

గోల్కొండ: అయోధ్య రామమందిర నిర్మాణం ప్రతి హిందువు జీవిత కల నెరవేరిందని అయోధ్య కరసేవకుడు కట్ట నర్సింగ్‌రావు అన్నారు. అయోధ్య కర సేవకులు, బీజేపీ నాయకులు, రామభక్తులతో కలిసి ఆయన బుధవారం కార్వాన్ సబ్జిమండి నుంచి అయోధ్య బయలుదేరి వెళ్లారు. బయలుదేరిన వారిలో కరసేవకులు జి.శివరత్నం, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఏ.విజయకృష్ణ, బి.శ్రీనివాస్, గాండ్ల నిరంజన్‌బాబు, మామిడి శివకుమార్ తదితరులున్నారు. అలాగే లంగర్‌హౌస్ నుంచి కూడా పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు అయోధ్యకు బయలుదేరి వెళ్లారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

దూద్‌బౌలి: ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను హుస్సేనీఆలం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి ఒక బ్లేడ్, నిక్కల్ పంచు, సెల్‌ఫోన్, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్ తెలిపారు. బుధవారం హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్, డీఐ స్వామితో కలిసి చార్మినార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ రుద్రభాస్కర్ మాట్లాడుతూ.. పరిగి గ్రామానికి చెందిన మల్లయ్య తన పెద్ద కుమార్తె పేట్ల బురుజు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చేరడంతో ఆమెను చూడడానికి గత నెల 23న, వచ్చి కాసేపు ఆసుపత్రి వద్ద ఫోన్ మాట్లాడుతుండడాన్ని గమనించిన రేహాన్ అఖ్వాన్, మీర్జా అబ్బాస్ అలీ ఖాన్ ద్విచక్రవాహనంపై అతని వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు ఫోన్ మాట్లాడి ఇస్తామంటూ తీసుకుని పారిపోతుండగా అడ్డుకోవడంతో బ్లేడ్‌తో గాయపరిచి సెల్‌ఫోన్‌తో ఉడాయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగా.. బుధవారం పంచ్ మొహల్లా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా పట్టుపడినట్లు ఏసీపీ తెలిపారు.

డిప్యూటేషన్ల రద్దుపై వైద్య ఆరోగ్యశాఖలో రగడ

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్ల రద్దుతో రగడ మొదలైంది. డిప్యూటేషన్ తీసుకున్న చిన్న స్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు డిప్యూటేషన్లను రద్దు చేయడంతో డిప్యూటేషన్ పొందిన ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కొందరు స్వాగతిస్తుండగా మరి కొందరు వ్యతిరేకిస్తున్నారు. కొందరు జెన్యూన్ కారణాల వల్ల డిప్యూటేషన్ల ఉన్న వారిని ప్రభుత్వం ఇగ్నోర్ చేయాలని వారు కోరుతున్నారు. అయితే డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్) డాక్టర్ రవీంద్ర నాయక్ ఉద్యోగుల స్థితిగతులను చూడకుండా డిప్యూటేషన్లు అన్ని రద్దు చేయాలని ఆదేశాలు పంపించడంతో సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. కొందరు అధికారులు కావాలనే ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వ్యక్తిగత సమస్యలపై ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్నవారిని రద్దు చేయకుండా చూడాలని ఉద్యోగులు తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కోరారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం పెంచాలి

అఫ్జల్‌గంజ్: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ 26,000లకు పెంచాలని సీఐటీయూ గోషామహల్ జోన్ కన్వీనర్ జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆశా వర్కర్లతో కలిసి బేగంబజార్ యూపీహెచ్‌సీ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మల్లీశ్వరికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈనెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌లో ఆశా వర్కర్లు కూడా పాల్గొంటారని తెలిపారు. 14 కోర్కెలతో కూడిన సమ్మె నోటీసును వైద్య అధికారికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు రజినీ, రాజేశ్వరి, పద్మలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం

గోల్కొండ: వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభకు బయటకు తీస్తాయిని మెహిదీపట్నం రాయల్ జూనియర్ కళాశాల డైరెక్టర్ కె.జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మెహిదీపట్నం రూప్ గార్డెన్‌లో కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగంలో రాయల్ జూనియర్ కళాశాలకు ఎవరు సాటిరారన్నారు. విద్యతో పాటు సంస్కృతిక, క్రీడా రంగాల్లో సైతం విద్యార్థులను శిక్షణ ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీ.వి.కృష్ణారెడ్డి, జె.వెల్సన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి



డైరీని ఆవిష్కరించిన సంఘం ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి పిలుపునిచ్చారు. బుధవారం అఫ్జల్‌గంజ్‌లోని గంగపుత్ర సంఘం భవనంలో సంఘం 10వ వార్షిక డైరీని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గంగపుత్రుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో గంగపుత్రులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో డైరీ కన్వీనర్ ఎర్ర బోయిన మల్లేష్, ట్రాఫిక్ పోలీస్ అధికారి సందిరి సంపత్, టీఎన్జీవోల సంఘం నగర అధ్యక్షుడు కె శ్రీకాంత్, జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి లక్ష్మయ్య పాల్గొన్నారు.

12 నుంచి నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



సమావేశంలో డిప్యూటీ ఈఓ నెహ్రూబాబు, డాక్టర్ ఆయోషా ముద్దాసిర్

యాకుత్‌పురా: నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు వైద్య ఆరోగ్య, విద్యాశాఖల సహకారంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నామని విద్యాశాఖ చార్మినార్ మండల డిప్యూటీ ఈఓ నెహ్రూబాబు, వైద్య విధాన పరిషత్ యాకుత్‌పురా–2 యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆయోషా ముద్దాసిర్ తెలిపారు. పురానీహవేలీలోని సక్సెస్ పాఠశాలలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులి పురుగుల నివారణకు ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్టు నెలలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు సీడీపీఓ జోత్స్న, వైద్యాధికారులు డాక్టర్ ఫర్హా, డాక్టర్ సనా, డాక్టర్ తబసుం పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ భవనంలో నిలిచిపోయిన లిఫ్టు

– లిఫ్టులో ఇరుక్కున్న బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి

నాంపల్లి: మాసబ్ ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం భవనం రెండవ అంతస్తులో లిఫ్టు మధ్యలోనే నిలిచిపోయింది. ఈ ఘటన మాసబ్ ట్యాంక్ పీఎస్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. లిఫ్టు ఒక్కసారిగా నిలిచిపోవడంతో లిఫ్టు ఎక్కిన వారంతా అయోమయానికి గురయ్యారు. అదే సమయంలో మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి మల్లయ్య భట్టు ఇరుక్కుపోయారు. ఆయనతో పాటుగా మరో ఐదురుగు సిబ్బంది కూడా లిఫ్టులో ఉన్నారు. పది నిమిషాల వరకు టెక్నీషియన్ అందుబాటులోకి రాకపోవడంతో అందరూ లిఫ్టులోనే ఉండిపోయారు. మరమ్మతుల తర్వాత లిఫ్టులో ఇరుక్కున్న వారంతా బయటకు వచ్చారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: సినిమా విశేషాలను తనదైన శైలీలో రచించి ఓ మంచి పుస్తకాన్ని రచయిత జీఆర్.మహర్షి అందించారని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. జమిలి సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు జీఆర్.మహర్షి రచించిన మార్నింగ్ షో అనే పుస్తకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సుదీర్ఘ కాలంగా సినిమా జర్నలిస్టుగా పనిచేసిన రచయిత తన అనుభవాలను చక్కగా విశ్లేషించారని కొనియాడారు. కథా, కథనాలు, పరిశ్రమలో వచ్చిన మార్పులను ఆలోచనాత్మకంగా విశ్లేషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు కుమారస్వామి (అక్షర), సాగర్ కె.చంద్ర, కరుణకుమార్, లక్ష్మీ సౌజన్య, కవి సిద్దార్థ్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఫార్చ్యూన్ హోటల్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

గన్‌ఫౌండ్రీ: అబిడ్స్ ఫార్చ్యూన్ హోటల్ వ్యభిచారం కేసులో మరో ముగ్గురు నిందితులను బుధవారం అబిడ్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ టి.నర్సింహారాజు తెలిపిన వివరాల ప్రకారం...గత వారం జరిగిన ఫార్చ్యూన్ హోటల్ కేసులో సబ్ ఆర్గనైజర్లుగా ఉన్న ఏ–13 రిఫాజ్, ఏ–15 రవికుమార్, ఏ–16 ఆర్.చేతన్‌ను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడికి పంపినట్లు తెలిపారు. నిందితులపై అనైతిక ట్రాఫిక్‌తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలియజేశారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న మరికొంత మంది నిందితులును పట్టుకోవడంతో పాటు విచారణ నిమిత్తం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఆర్‌డీఓ ఆదేశాల మేరకు ఫార్చ్యూన్ హోటల్‌ను సీజ్ చేసినట్లు గుర్తుచేశారు.



షబ్బే మేరాజ్‌ను పురస్కరించుకొని శాలిబండ డివిజన్ ఖాజీపురాలోని నవాయిత్ మజీద్‌లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త గురించి మొహమ్మద్ సాజిత్ మౌలానా వివరించారు. – శాలిబండ

డ్రైవర్ కమ్ ఓనర్స్‌కు న్యాయం చేయండి



అబిడ్స్: ప్రభుత్వ శాఖల్లో కొంతమంది అధికారులు డ్రైవర్ కమ్ ఓనర్ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్స్ కమ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రాజేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శేషుబాబు, ప్రధాన కార్యదర్శి దేవేందర్, సీనియర్ నాయకుడు గోవర్ధన్ పేర్కొన్నారు. కొంతమంది అధికారుల వల్ల తామంతా నష్టపోతున్నామని నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిరుద్యోగుల ఉపాధి కోసం 2014లో ప్రవేశపెట్టిన డ్రైవర్స్ కమ్ ఓనర్స్ పథకాన్ని పలు శాఖ అధికారులు తమ సొంత వాహనాలను నడిపిస్తూ తమను మోసం చేస్తున్నారన్నారు. అన్ని శాఖల్లో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ పెరిగిన దృశ్య తమకు రూ.45, వేలు ఉన్న ప్యాకేజీను రూ.55 వేలకు పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. విచారణ జరిపి డ్రైవర్ కమ్ ఓనర్ సభ్యులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ పాలనలో బీసీలకు అన్యాయం



గౌరీ సతీష్

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే గురించి ఏనాడైనా పట్టించుకున్నారా..? అని ఆయన ప్రశ్నించారు. బుధవారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ విలేకర్లతో మాట్లాడుతూ..బీసీ విద్యార్థులకు ఓవర్ ఫీజు ఎడ్యుకేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎవరికి కనీసం మంజూరు కూడా చేయలేదన్నారు. బీసీ కార్పొరేషన్‌ను బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం కేసీఆర్ కుటుంబం కోసమే పదేళ్ల అక్రమాలకు పాల్పడుతూ కేసీఆర్ కుటుంబ అభివృద్ధికే పాల్పడిందన్నారు. బీసీలను అన్నివిధాల మోసం చేసిన కేసీఆర్‌కు ఈ పార్లమెంటు ఎన్నికల్లో కూడా బీసీలంతా తగిన గుణపాఠం చెబుతారని గౌరీ సతీష్ అన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిద్దాం



మాట్లాడతున్న బాలకృష్ణ తదితరులు

జియాగూడ: ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆది జాంబవ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బాలకృష్ణ నాగేశ్వర్ అన్నారు. బుధవారం జియాగూడ ఇంద్రానగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో హైదరాబాద్ సాంస్కృతిక సమ్మేళనం సందర్భంగా హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, డ్రైయింగ్స్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్, సాంస్కృతిక కార్యదర్శి ప్రేమ్‌కుమార్, హైదరాబాద్ జిందాబాద్ సంస్థ జియాగూడ అధ్యక్షులు అత్తాపూర్ రాజేష్, టీచర్లు లావణ్య, మనీష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.